## క్లుప్తంగా

### ఉపాధ్యాయుడికి పరామర్శ



ఉపాధ్యాయుడు మల్లేష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: పాల్తూరు గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లేష్ ఈనెల 10న పెన్నహోబిలంలో ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడిని సోమవారం ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డితో పాటు పార్టీ మండల రూరల్ కన్వీనర్ సుంకన్న, నాయకులు అమిద్యాల రాజేష్, లాలుస్వామి, జయరాం, వీరేష్ పరామర్శించారు. ఉపాధ్యాయుడికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరావుకు మాజీ ఎమ్మెల్యే సూచించారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, పీడీ

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి విరాట్‌ఆచారి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం వేణుగోపాల్, పీడీలు సత్యనారాయణ, కళా సుధాకర్ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని వారు అభినందించారు. వారు మాట్లాడుతూ విరాట్ ఆచారి 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడన్నారు. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు నంద్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటారన్నారు.

### ఆలయ పునరుద్ధరణకు విరాళం

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లిలో సవారమ్మ ఆలయ పునరుద్ధరణ పనులకు అదే గ్రామానికి చెందిన జీకే కృష్ణమూర్తి రూ.5 లక్షలు విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. ఆ నిధులతో ఆలయంలో రచ్చకట్ట, ధ్వజ స్తంభం ఏర్పాటు చేయాలని, రెండు మూడు రోజుల్లో ఆలయ కమిటీకి నగదు అందజేస్తానన్నారు.

### ఘనంగా ఆవుల జాతర



పూజలందుకుంటున్న జుంజప్ప స్వామి

బ్రహ్మసముద్రం: మండలంలోని గుడిపల్లి పైదొడ్డి గ్రామంలో సోమవారం ఆవుల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవుల కులదైవం జుంజప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గ్రామ సమీపంలోని ఆవుల గూడు వద్ద జుంజప్పస్వామి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పశువులను ప్రదక్షిణలు చేయించారు. జాతరను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
సెట్టూరు: మండలంలోని కనుకూరు, బచ్చేహళ్లి గ్రామాల్లో ఆవుల జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రసిద్ధి గాంచిన రామలింగేశ్వస్వామి, నరసింహస్వామి, చిత్రలింగ స్వాములను ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకెళ్లారు. గ్రామంలోని పశువులు, ఎడ్లబండ్లు, వాహనాలతో ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

### ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన



బెళుగుప్ప: మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

బెళుగుప్ప: ఓటరు నమోదు ప్రక్రియలో వచ్చిన దరఖాస్తులపై బీఎల్‌ఓలు సమగ్ర విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందించాలని డిప్యూటీ కలెక్టర్, కేఆర్‌ఆర్‌సీ శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మంటపంలో తహసీల్దార్ ఓబుళేసు, డీటీ పీరాతో కలసి బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఫారం-6, 7,8కు సంబంధించి బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు.
గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా 45 పోలింగ్ కేంద్రాలు, ఆన్‌లైన్‌ద్వారా ఇప్పటి వరకు 7403 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు ఎన్నికల ఓటర్ల జాబితాలో చేర్పులకు 2277, మార్పులకు 3249, తొలగింపునకు 1877 దరఖాస్తులు అందాయన్నారు. వీటిపై పూర్తిగా పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామన్నారు.

# కార్తీకం.. దేదీప్యం



కూడేరు: సంగమేశ్వరాలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కళ్యాణదుర్గం రూరల్: అక్కమ్మ ఆలయ ఆవరణలో దీపాలు వెలగిస్తున్న భక్తులు



రాయదుర్గం: అలంకరణలో నీలకంఠేశ్వరుడు



కళ్యాణదుర్గం రూరల్: అఖండ జ్యోతి వెలగిస్తున్న దృశ్యం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ఆఖరు సోమవారం ఘనంగా పూజలు

రాయదుర్గం/టౌన్: కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆఖరి కార్తీక సోమవారం కావడంతో భక్తులు శివలాయాలకు వేకువజాము నుంచే క్యూకట్టారు. పట్టణంలోని బళ్లారి రోడ్డులో ప్రసిద్ధి చెందిన నీలకంఠేశ్వరుడు, భక్త మార్కండేయ, జంబుకేశ్వర, హాటకేశ్వర, బసవ నాగలింగేశ్వర ఆలయాలతో పాటు నియోజకవవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్, డి హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లోనూ శివాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. డి హీరేహాళ్ మండలం గవిసిద్దేశ్వర ఆలయంలో 116 శివలింగాలకు పూజలు చేపట్టారు. అలాగే మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు కోటలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరుడి ఆలయంలోనూ కార్తీక సందడి కనిపించింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పటిష్ట చర్యలు చేపట్టారు. అలాగే పట్టణంలోని కోటలో వెలసిన శ్రీనగరేశ్వరస్వామికి భస్మాభిషేకం చేశారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం మద్దానేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన లక్షదీపోత్సవం కార్యక్రమానికి ఉజ్జయిని పీఠాధిపతి త్రిదండి శివాచారస్వామి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఆలయకమిటీ సభ్యులు , గ్రామ పెద్దలు ఆయనకు స్వాగతం పలికి, పాదపూజ చేశారు. స్వామీజీ తొలుత మద్దానేశ్వర స్వామి ఆలయంతో పాటు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామీజీ కార్తీక దీపోత్సవ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు అశేషంగా పాల్గొన్నారు.

**మార్మోగిన శివనామస్మరణ**

కూడేరు: శంభో శంకర హరహర మహదేవ అంటూ కూడేరులో ప్రసిద్ధిగాంచిన స్వయంభు శివపార్వతుల జోడులింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శివ నామస్మరణ మార్మోగింది. కార్తీక మాస చివరి సోమవారం కావడంతో జోడు లింగాలను దర్శించుకునేందుకు జిల్లా నలమూలల నుంచి భక్తులకు వందలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కిక్కిరి పోయింది. మహిళలు ధ్వజస్తంభం, ఆలయం చుట్టు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు, పోనుగంటి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వజ్రకరూరు: మండల పరిధిలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. కార్తీక చివరి సోమవారం కావడంతో మహిళలు దీపాలు వెలిగించారు. వజ్రకరూరులోని నగరేశ్వరస్వామి, భో గేశ్వర స్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. అదేవిధంగా జరుట్ల రాంపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, కొనకొండ్లలోని ఛాయామల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలు నిర్వహించారు.

కళ్యాణదుర్గం రూరల్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పట్టణంలోని అక్కమ్మ దేవస్థానంలో అఖండ జ్యోతి ప్రజ్వలన, ఊయ్యాలోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు అక్కమ్మ దేవతల కలశ ప్రతిష్ట నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. 6 గంటలకు అక్కమ్మ గార్ల కొండపై అఖండ జ్యోతి ప్రజ్వలన, ఊయలోత్సం చేపట్టారు. మహిళలు ఆలయ ప్రగణంలో దీపాలు వెలగించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ రాము, వైస్ చైర్మన్ నాగిరెడ్డి, కమిటీ సభ్యులు, మాలధారులు పాల్గొన్నారు.

కుందుర్పి: కార్తీక సోమవారం ఆలయాలు శివనామ స్మరణంతో మార్మోగాయి. గుమ్మట శివాలయం, తూముకుంట హరిహరేశ్వర ఆలయం, నాగేపల్లి తిప్పే రుద్రస్వామి ఆలయాల్లో పూజలు చేపట్టారు.



రాయదుర్గం: పూజలందుకుంటున్న మురడి ఆంజనేయస్వామి



రాయదుర్గంటౌన్: అలంకరణలో నగేరశ్వరస్వామి



వజ్రకరూరు: పూజలందుకుంటున్న భోగేశ్వరస్వామి



జరుట్లరాంపురంలో రామలింగేశ్వరస్వామి



రాయదుర్గం మండలం మద్దానేశ్వరాలయంలో కార్తీక లక్ష దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న త్రిదండి శివాచార మహాస్వామి

### 'సంకల్పయాత్రను జయప్రదం చేద్దాం'

గుమ్మఘట్ట: వికసిత్ సంకల్పయాత్రను జయప్రదం చేద్దామని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. ఈ నెల 12న మారెంపల్లి, 75 వీరాపురం, 13న పూలకుంట, రంగసముద్రం, 14న సిరిగేదొడ్డి, గొల్లపల్లి, 15న తాళ్లకెర-1, గొల్లపల్లి , 16న తాళ్లకెర-2, గుమ్మఘట్ట, 17న కలుగోడు-1గోనబావి, 18న కలుగోడు-2, బేలోడు, 19న భూపసముద్రం గ్రామాల్లో సంకల్పయాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### ప్రభుత్వ పథకాలపై సమీక్ష

కుందుర్పి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వివిధ సంక్షేమ పథకాల అమలుపై ఎంపీడీఓ లక్ష్మీనరసింహ అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం 33 పథకాలు అమలు చేయగా అర్హులై ఉండి నేటికీ పథకాలు పొందని వారిని గుర్తించి పథకాలు అమలు చేయాలన్నారు. అలాగే నాడు-నేడు పనులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సిమెంట్ రోడ్లు తదితర పనులను గడువు లోపు పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మారుతీ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దీపిక, ఏపీఓ ఓబిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీకి పరామర్శ



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని పరామర్శిస్తున్న ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో సోమవారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఎమ్మెల్సీ సతీమణి వై.ఉమాదేవి ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. సోమవారం ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్త, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ తదితరులు కొనకొండ్లకు వెళ్లి ఎమ్మెల్సీతోపాటు కుమారుడు వై.భీమిరెడ్డిని పరామర్శించి సానుభూతి తెలిపారు.

### ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని అక్కమాంబ ఆలయం దగ్గర సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని కళ్యాణదుర్గానికి చెందిన సాయి వరప్రసాద్, కంబదూరుకు చెందిన సాయికుమార్ గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు సాయికుమార్‌ను అనంతపురానికి తరలించారు.

## జగనన్నకు అండగా నిలుద్దాం



జెండా ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మరోసారి అండగా నిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం 17వ సచివాలయం పరిధిలోని 30వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని కౌన్సిలర్ గోరంట్ల ఉష, వార్డు ఇన్‌చార్జ్ సత్యనారాయణ, పార్టీ పట్టణ కన్వీనర్ అరవా శివప్పతో కలసి మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డును ప్రారంభించిన అనంతరం సచివాలయ సమీపంలో పార్టీ శ్రేణులతో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎంగా జగన్ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మోసకారి చంద్రబాబును నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, బండి అజయ్, శ్రీనివాసరెడ్డి, కొంతం దేవరాజు, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, పట్టణ మాజీ కన్వీనర్ ముస్తాక్, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

### పారదర్శకంగా సామాజిక తనిఖీ

కణేకల్లు: ఉపాధి పనులపై సామాజిక తనిఖీ పారదర్శకంగా చేయాలని ఎస్‌ఆర్‌పీ వెంకటేశ్‌నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిటింగ్ ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో డీఆర్పీలతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈసీ రమణ, టీఏలు నరసింహాచారి, సోమన్నగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.
బ్రహ్మసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ దాసానాయక్ ఉపాధి హామీ సిబ్బంది హాజరయ్యారు. సామాజిక తనిఖీ అధికారులకు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది సహకరించాలన్నారు. ఏపీఓ అవినాష్, ఎస్‌ఆర్పీ వెంకటేశ్‌నాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### శుభ్రతతో పుండ్లు కాకుండా అరికట్టవచ్చు

కూడేరు: కుష్టు వ్యాధిగ్రస్తులు రోజూ కాళ్లు, చేతులను సబ్బుతో శుభ్రం చేసుకుంటే పుండ్లు కాకుండా అరికట్టవచ్చని జిల్లా పారా మెడికల్ ఆఫీసర్(డీపీఎంఓ) తిప్పేస్వామి సూచించారు. సోమవారం మండలంలోని కుష్టు రోగుల కాలనీలో జిల్లా వైద్యాధికారులు వైద్య పునరావాస శిబిరం నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. అనంతరం కాళ్లు, చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్‌ఎం భాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మాయమాటలతో రూ.5 లక్షల టోకరా



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబం

రాయదుర్గం: ఓ ఘరానా మోసగాడి మాయమాటలకు ఓ కుటుంబం బలైపోయింది. ఫలితంగా ఇల్లు సైతం అమ్ముకుని కుటుంబం మొత్తం రోడ్డు పాలైంది. బాధితులు సోమవారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించడంతో ఈ సంఘటన వెలుగుచూసింది. వివరాల్లోకెళ్లితే.. పట్టణానికి చెందిన వాల్మీకి మల్లెల తిప్పేస్వామి, తిప్పమ్మకు గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం వద్ద సర్వే 126, 126/1లో 25 ఎకరాల పొలం ఉంది. కుటుంబ అవసరాల నిమితం దశలవారిగా ఆ పొలం మొత్తం అమ్ముకున్నారు. వీరికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలందరికీ వివాహం జరిపించారు. కుమారుడు కూలీ పనులకెళుతూ చేదోడుగా నిలిచారు. జెండు బామ్ వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి (ప్రస్తుతం ఓ దిన పత్రికలో పాత్రికేయుడు) తరచూ వారి ఇంటికి వెళ్లేవాడు. అమ్మకం చేపట్టిన భూమి పట్ల వారిమధ్య చర్చకు వచ్చింది. భూమి రిజిస్టర్ పత్రాల్లో సంతకాలు సక్రమంగా లేవని తనకు తెలిసిన ఇద్దరు వ్యక్తులను ఆశ్రయిస్తే తిరిగి దక్కించుకోవచ్చని, రూ.25 కోట్ల ఆస్తి మీ సొంతమవుతుందని నమ్మబలికాడు. ఆశపడిన వారు బీటీపీ ప్రధాన రహదారిలో నివాసం ఉండే ఇంటిని రూ.5 లక్షలకు విక్రయించి, డబ్బంతా అతడికి ముట్టజెప్పారు. సుమారు మూడేళ్లు దాటిపోతున్నా సమస్యకు అతీగతి లేదు. నిలదీస్తే అప్పుడప్పుడు కొంతడబ్బు ఇచ్చి సర్దిచెబుతూ వచ్చాడు. మోసపోయామని తెలిసి అతడిని ఇటీవల గట్టిగా నిలదీయడంతో పెద్దమనుషుల సమక్షంలో రూ.2 లక్షలు డిసెంబర్ 9న ఇచ్చేలా అగ్రిమెంట్ రాశారు. గడువు పూర్తైనా స్పందించకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ విషయం పై అర్బన్ సీఐ లక్ష్మన్నను వివరణ కోరగా.. రూ.5 లక్షలు మోసం చేశాడని బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులకు న్యాయం చేసేలా కృషి చేస్తామన్నారు.

### కొనసాగుతున్న 'సంకల్పయాత్ర'

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లి, ఎరడికెర గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములను గుర్తించండి

కుందుర్పి: మండల వ్యాప్తంగా ప్రభుత్వ బంజరు భూములు సహా వంక, గుట్ట, కొండ పొరంబోకు భూములను గుర్తించాలని తహసీల్దార్ విజయ కుమారి సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జగనన్న భూసర్వే, ప్రభుత్వ భూముల గుర్తింపుపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ప్రస్తుతం నిజవల్లి, జంబుగుంపల, అప్పిలేపల్లి, బెస్తరపల్లి రెవెన్యూ గ్రామాల్లో 'జగనన్న భూసర్వే' చేపడుతున్న తరుణంలో ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. గుర్తించిన ప్రభుత్వ భూముల్లో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా రికార్డుల్లో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయరాదన్నారు. కుందుర్పి, ఎనుములదొడ్డి, మలయనూరు, ఎస్.మల్లాపురం, బసాపురం రెవెన్యూ గ్రామాల్లో ఎక్కువ శాతం ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. డీటీలు తిప్పేస్వామి, కుళ్లాయప్ప, వీఆర్‌ఓలు రాజశేఖర్, నరసింహమూర్తి, తిమ్మప్ప, సంజీవ్‌రెడ్డి, సర్వేయర్లు ఉన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోతిగుట్ట ఏరియాలో ఉన్న ప్రేమ సన్నిధి ట్రస్ట్‌లో అనాథ పిల్లల కోసం ఎస్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ సభ్యుల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరప్ప, గుమ్మఘట్ట మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మీకాంతారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివ, రుద్రప్ప, ముస్సద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ ఆదర్శం.. ఏసుక్రీస్తు జీవితం



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

కూడేరు: ఏసు క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముద్దలాపురంలో ఉన్న బేతనీయ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే హాజరై పాస్టర్ గబ్రేయోలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కేక్ కట్ చేసి క్రైస్తవులందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇతరుల పట్ల దయ, కరుణ, శాంతి, ప్రేమను చూపించాలని, ఇది ఏసు మార్గమన్నారు.అనంతరం ఆయనను పాస్టర్లు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, సర్పంచులు ధనుంజయ్య, నాగమ్మ, హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి , జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, నాయకులు మంజునాథ్‌రెడ్డి, బోయ నరేష్, నాగిరెడ్డి, క్రిష్టారెడ్డి, రామాంజనేయులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

### తక్షణసాయం అందజేత

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 30వ వార్డులో ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి సునీల్ అనే కూలి మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ.5 లక్షలకు గాను రూ.10 వేలు తక్షణ నగదు సాయాన్ని సోమవారం మృతుడి భార్య జ్యోతికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అందజేశారు. బీమా కింద మిగతా రూ.4.90 లక్షలు త్వరలో నామినీ ఖాతాకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్ గోరంట్ల ఉష, పట్టణ మాజీ కన్వీనర్ ముస్తాక్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, గోరంట్ల సత్యనారాయణ, గంగాధర్, గోల్డ్ ఇస్మాయిల్, వైజాగ్ రవి, మల్లికార్జున, ఓబ తదితరులు పాల్గొన్నారు.
ఉరవకొండ: స్థానిక 14వ వార్డు కామన్నకట్ట వద్ద ఇటీవల మృతి చెందిన షేకన్‌బీ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను సర్పంచ్ లలితమ్మ, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు అందజేశారు. మిగతా బీమా మొత్తం త్వరలో నామినీ ఖాతాకు జమవుతుందన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రేఖ, వలంటీరు జరీనా, పార్టీ నాయకుడు షేక్షావలి పాల్గొన్నారు.

### పిల్లలపల్లికి హైస్కూల్ మంజూరు

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లి గ్రామానికి హైస్కూల్ మంజూరైందని ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో ప్రస్తుతం 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాల ఉందన్నారు. 9వ తరగతి చదవాలంటే విద్యార్థులు కనీసం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో పేద విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేయాల్సి వచ్చేదన్నారు. పిల్లలపల్లిలో హైస్కూల్ మంజూరు చేయాలని గత ప్రభుత్వాల హయంలో ఎంతో మంది ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, నేడు వైఎసార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యను మంత్రి ఉషశ్రీచరణ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి హైస్కూల్ మంజూరు చేయించారన్నారు. దీంతో తమ గ్రామంతో పాటు ముప్పలకుంట, గొంచిరెడ్డిపల్లి, ముద్దలాపురం , బొమ్మగానిపల్లి తదితర గ్రామాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్‌కు రుణపడి ఉంటామన్నారు.

### అరవకూరు రోడ్డు సమస్యకు పరిష్కారం

కూడేరు: ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి కృషితో మండలంలోని అరవకూరు రోడ్డు సమస్యకు పరిష్కారం లభించింది. అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి నుంచి అరవకూరు ఒకటిన్నర కిలోమీటర్ దూరం ఉంది. ఈ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడేవారు. గ్రామస్తులు సమస్యనుమాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఉపాధి పథకం కింద తారు రోడ్డు ఏర్పాటుకు రూ.75 లక్షలు నిధులు మంజూరు చేయించారు. సోమవారం తారు రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డు నాణ్యతను ఎంపీపీ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ దేవ, సర్పంచ్ రామాంజనేయులు, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి పరిశీలించారు. తారు రోడ్డు ఏర్పడడంతో గ్రామస్తులు విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన కేసులో పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన బోయ భరత్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ లక్ష్మణ్ణ తెలిపారు. గుమ్మఘట్ట రోడ్డులోని బీఎస్‌టీ పెట్రోల్ బంకు వద్ద తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంలో 192 టెట్రా ప్యాకెట్లతో కూడిన బాక్సు పట్టుబడిందన్నారు. మద్యంతో పాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.